ప్రజాశక్తి

మంగళవారం 26 మార్చి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వివాదాలు, ఆర్థిక అభియోగాలు @ బిజెపి అభ్యర్థులు



సిఎం రమేష్ (అనకాపల్లి)



కొత్తపల్లి గీత (అరకు)

- సిఎం రమేష్‌పై ఫోర్జరీ, కొత్తపల్లి గీతపై ఛీటింగ్ కేసు
- తేలని గీత కుల విషయం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కేసులు, వివాదాలున్న సిఎం రమేష్, కొత్తపల్లి గీతలను అనకాపల్లి, అరకు ఎంపీ అభ్యర్థులుగా బిజెపి బరిలోకి దించడంపై ఉమ్మడి విశాఖ జిల్లాలో సర్వత్రా చర్చ నడుస్తోంది. వారిపై ఉన్న కేసులేవీ ప్రజా సమస్యలపై పోరాటాలకు సంబంధించినవేమీ కావు. డబ్బు వ్యామోహంలో ఫోర్జరీ, ఛీటింగ్‌కు పాల్పడ్డంతో నమోదైన కేసులవి. డబ్బులు భారీగా ఖర్చు చేసే శక్తివంతులైన వ్యక్తులను పోటీకి అర్హతగా బిజెపి చూసినట్లుంది. అందుకే ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి వంటి ఆశావహులను పక్కకుబెట్టి స్థానికేతరుడైన రమేష్‌కు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ కేటాయించింది. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించిన అనకాపల్లి, అరకు పార్లమెంట్ స్థానాల నుంచి ఆదివారం అభ్యర్థులుగా ప్రకటించిన సిఎం రమేష్, కొత్తపల్లి గీతలపై ఆర్థికపరమైన అభియోగాలతో కేసులున్నాయి. గీత ఎస్‌టి రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన అరకు నుంచి పోటీ చేస్తోంది. ఆమె కులంపై వివాదం నడుస్తోంది. ఆమె ఎస్‌టి కాదని గీతపై గతంలో పోటీచేసిన టిడిపికి చెందిన గుమ్మడి సంధ్యారాణి హైకోర్టులో పిటిషన్ వేశారు. గెలిచాక టిడిపికి గీత దగ్గరకావడంతో టిడిపి మెత్తబడింది.

గీత ఎస్‌టి కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వుపై హైకోర్టును ఆశ్రయించడంతో ఆ ఉత్తర్వును సస్పెండ్ చేసింది. ఎస్‌టి కుల వివాదం నుంచి గీత బయటపడకుండానే అరకు ఎంపీ అభ్యర్థిగా బిజెపి ప్రకటించడం విమర్శలకు తావిస్తోంది. 2014 ఎన్నికల్లో వైసిపి ఎంపీగా గెలిచిన ఆమె ఆ పార్టీని వీడి జనజాగృతి పార్టీ పెట్టారు. తరువాత బిజెపిలో విలీనం చేశారు. హైదరాబాద్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన కేసులో సిబిఐ ఆమెపై చార్జిషీట్ దాఖలు చేసింది. విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టరైన తన భర్త రామకోటేశ్వరరావుతో కలిసి బ్యాంకుకు తప్పుడు డాక్యుమెంట్లు సమర్పించి రూ.42 కోట్ల రుణం పొంది, ఇతర అవసరాలకు మళ్లించారన్న అభియోగంపై హైదరాబాద్ సిబిఐ కోర్టు మిగతా 2లో..



ఆర్‌కె బీచ్‌లో సందడి చేస్తున్న యువత



ఉత్సాహంగా హోలీ

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం హోలీ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. అన్ని తరగతుల ప్రజానీకం రంగులు పూసుకుంటూ సందడి చేశారు. కులమత భేదాలను పక్కనబెట్టి ఈ వేడుక సాగింది. విశాఖ సాగర తీరానికి యువతీ యువకులు పోటెత్తారు.

వార్తలు 8లో..

మందులకు నిధులు విడుదల చేయాలి : సిపిఎం

▶ వార్త 5లో..

జూ పార్కులో జిరాఫీ మృతి

▶ వార్త 3లో..

తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

▶ వార్త 2లో..



యువకులను రక్షించిన లైఫ్‌గార్డ్స్

శభాష్.. లైఫ్‌గార్డ్స్

సముద్రంలో మునిగిపోతున్న యువకులను కాపాడినందుకు ప్రశంసలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి జోన్ - 4 ఆర్కే బీచ్, జోన్ -6 అప్పికొండ బీచ్‌లలో సోమవారం హోలీ సందర్భంగా స్నానానికి సముద్రంలో దిగి మునిగిపోతున్న నలుగురు యువకులను జివిఎంసి లైఫ్ గార్డులు రక్షించారు. ఈ సందర్భంగా లైఫ్‌గార్డులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సోమవారం మెచ్చుకున్నారు. విశాఖపట్నం రైల్వే న్యూ కాలనీకి చెందిన మిగతా 2లో..

ఆ రెండు పార్టీల విధానం ఒక్కటే !

- విశాఖ సమస్యల అజెండా పట్టని వైనం
- వైసిపి, టిడిపి ఎంపీ అభ్యర్థులపై ఇదే చర్చ!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పార్లమెంట్ స్థానంపై ప్రధాన పార్టీల కళ్లు పడ్డాయి. ఇక్కడ గెలిస్తే నేరుగా ఢిల్లీకెళ్లి గల్లీ పనులన్నీ చక్కబెట్టుకోవచ్చుననే అభిప్రాయం వారిలో కనిపిస్తోంది. పైగా ఈ స్థానం నుంచి పోటీచేసేవారిలో ఇప్పటివరకూ అంతా స్థానికేతరులే. అంటే విశాఖకు చెందని వారే అన్నమాట. తమ తమ పార్టీలపై భారం వేసి, ధనబలాన్ని నమ్ముకుని గట్టెక్కేవారే అధికం. ఈ నేపథ్యంలో విశాఖ ప్రాంత ప్రజా సమస్యల అజెండా కలగానే జనానికి మిగిలిపోతూ వస్తోంది. 2024 ఎన్నికలకు రంగం సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ తరుణంలో ఈ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే విశాఖ నగరంలోని తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఉత్తరం, గాజువాక, భీమునిపట్నం, శృంగవరపుకోట అసెంబ్లీ సెగ్మెంట్ల ప్రజానీకంలో ప్రధాన పార్టీల విధానాలపై చర్చ జరుగుతోంది. ఈ దఫా అధికార వైసిపి నుంచి విజయనగరానికి చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, తెలుగుదేశం నుంచి గీతం విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీభరత్ ఎంపీ అభ్యర్థులుగా బరిలోకి దిగారు. విశాఖ పార్లమెంట్ నుంచి టికెట్ ఆశించిన బిజెపి రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు మూడేళ్లుగా చేసిన ప్రయత్నాలేవీ ఫలితమివ్వలేదు.

వైజాగ్ స్టీల్‌ను బలహీనపరిచే బిజెపి తానులో ముక్కలే పోటీ..

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి అమ్మడానికి కుట్రలు చేస్తోంది. ఈ క్రమంలోనే గనులు ఇవ్వకుండా ఆర్థికంగా, సాంకేతికంగా ఉక్కును బలహీనపరుస్తోంది. ముడి ఇనుము దక్కకుండా నిర్వీర్యం చేస్తున్నా ప్రధాన పార్టీలకు చీమకుట్టినట్టయినా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వివాదాలు, ఆర్థిక అభియోగాలు @ బిజెపి అభ్యర్థులు

వీరికి ఐదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ 2022 సెప్టెంబరు 13న తీర్పు ఇచ్చింది.

ఇక అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ విషయానికొస్తే, తాజాగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో రూ.450 కోట్లకు సంబంధించి ఫోర్జరీ కేసు నమోదైంది. బిజెపి రాజ్యసభ సభ్యుడైన ఆయన రూ.30 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కాంగ్రెస్ పార్టీకి, ఐదు కోట్ల విలువైన బాండ్లను టిడిపికి ఇవ్వడంపై చర్చ నడుస్తోంది. ఐటి దాడులతో టిడిపిని వీడి బిజెపిలో ఆయన చేరారు. ఇతని రాజ్యసభ పదవీ కాలం ఈ ఏడాది జూన్ ఒకటితో ముగియనుంది.

ఆ రెండు పార్టీల విధానం ఒక్కటే !

ఇంతవరకూ లేదు. బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేనలు ఎంతవరకు స్టీల్‌ప్లాంట్‌కు న్యాయం చేయగలవన్నది సమాధానం దొరకని ప్రశ్న. ఇప్పటికే వాల్తేరు రైల్వేజోన్‌ను కేంద్ర బిజెపి ఇక్కడ నుంచి లేపేసింది రాయగడ, విజయవాడల్లో కలిపేసినా ఈ పార్టీలు పత్రికా ప్రకటనలకే పరిమితమయ్యాయి తప్ప పోరాడింది లేదు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌పై బిజెపి నాటకాలు ఆడుతున్నా పల్లెత్తి మాట అనడం లేదు. ఇప్పుడు ఆ పార్టీల నుంచి బరిలోకి దిగుతున్న నాయకులు సైతం మాట్లాడిన దాఖలాలు లేవు. వైసిపి ప్రభుత్వం ఉక్కుపై అసెంబ్లీలో తీర్మానం చేసి స్తబ్దుగా ఉండిపోయింది. దీంతో కేంద్రంలోని బిజెపి తన అమ్మకం నిర్ణయంపై పునరాలోచన చేయలేదు. ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర బిజెపి ప్రయత్నించగా ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్, మిగతా పక్షాలన్నీ ఏకమై ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి కూటమిలోగల టిడిపి, జనసేనలకు అసలు ఈ సమస్యే పట్టలేదు. వైసిపి లెక్కలేనితనంతో వ్యవహరిస్తోంది.

నీటికొరత, పర్యావరణ సమస్యలపై అజెండా ఏదీ ?

విశాఖ నగరం 20 లక్షల జనాభాను ఏనాడో దాటేసింది. ప్రజలకు తీవ్ర నీటికొరత అనేక వార్డుల్లో పెద్ద సమస్యగా పరిణమించినా పాలకులకు పట్టడం లేదు. మురికి వాడల్లో సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. వార్డుల్లో నివాసం ఉండే జనాలకు సదుపాయాల కొరత వెంటాడుతోంది. విశాఖ జనాభాలో ప్రతి ముగ్గురిలో ఒకరు మురికివాడలో నివసిస్తున్నారు. ఇళ్లు, తాగునీటి సమస్యతో పాటు వర్షమొస్తే మురుగునీటి సమస్యతో వేల కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. ప్రధాన పార్టీలేనాడూ వారిని పట్టించుకున్న పరిస్థితి లేదు.

గత టిడిపి, నేటి వైసిపి ఈ సమస్యలకు కారకులుగా ఉన్నాయి. కాలుష్యం వెదజల్లే నగరాల్లో విశాఖ అగ్రస్థానంలో ఉంది. పోర్టు వల్ల గాలి కాలుష్యం వేగంగా అన్ని ప్రాంతాలకూ విస్తరించినా ఇంతవరకూ ఏ ఎంపీ దీనిపై సరిగా కేంద్రానికి అడ్రస్ చేసిన దాఖలా లేదు. విశాఖకు అండగా ఉండే కొండలపై పర్యావరణం దెబ్బతింటోంది. కొండల్ని పాడుచేసే విధానంతో గత టిడిపి, నేటి వైసిపి వ్యవహరించాయి. ఈ పార్టీలు పరిష్కారం చూపుతాయన్న నమ్మకం ప్రజల్లో ఏనాడో సడలిపోయింది. ప్రధాన పార్టీలు ప్రజలను ఓట్లు అడిగే అర్హత కోల్పోయాయని సిపిఎం, సిపిఐ, వామపక్షాల నేతలు చెబుతున్నారు. ప్రజలు ప్రత్యామ్నాయం దిశగా ఆలోచించాలని కోరుతున్నారు.

శభాష్.. లైఫ్‌గార్డ్స్

కౌశిక్, బషీర్, తుంగ్లాం ప్రాంతానికి చెందిన సన్నీ కుమార్, గోల్ కుమార్ హోలీ వేడుకల్లో భాగంగా విశాఖ ఆర్కే బీచ్ పాండురంగాపురం, అప్పికొండ బీచ్ సమీపంలో ఆటవిడుపుగా స్నానాలకు దిగారు. ప్రమాదవశాత్తు మునిగిపోతున్న వారిని లైఫ్ గార్డ్స్ హరీష్, నవీన్, అరవింద్, అచ్చన్న, కిషోర్, వెంకటేష్, తాతారావులతోపాటు పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది వై.గణపతి తదితరులు ఒడ్డుకు చేర్చారని తెలిపారు. ఒకరికి సిపిఆర్ జరిపి వెంటనే 108లో కేజీహెచ్‌కు తరలించారని, అందరూ ప్రాణాలతో ఉన్నారని చెప్పారు.

చంద్రబాబును కలిసిన సీతంరాజు సుధాకర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం నుంచి టిడిపి తరుపున పోటీ చేయాలని గట్టిగా భావిస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సీతంరాజు సుధాకర్ ఇప్పటికీ తన ప్రయత్నాలను ఆపలేదు. ఈ నియోజకవర్గం పొత్తులో భాగంగా జనసేనకు వెళ్లడంతో ఆ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌ను పార్టీ అభ్యర్థిగా పవన్ కల్యాణ్ నిర్ధారించారు. అయితే అధికారిక ప్రకటన జరగలేదు. ఈ విధంగా జరగడం వెనుక పెద్ద వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఈ నియోజకవర్గంలో తగిన బలం లేకపోవడం, ఆర్థికలేమి కారణాలు, అంతకుమించి ఆయన అభ్యర్థిత్వాన్ని ఈ నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు కొందరు తీవ్రంగా వ్యతిరేకించడం ప్రతికూలంగా మారాయి.

ఈ నేపథ్యంలో దక్షిణంలో వంశీకృష్ణ గెలుస్తారా...? గెలవరా...? అనే దానిపై అటు టిడిపి, ఇటు జనసేన ప్రత్యేకంగా, రహస్యంగా ఒక సర్వే నిర్వహించాయి. సర్వేలో వంశీకష్ణకు ఏమాత్రం అనుకూలత రాలేదని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. ఈ నియోజకవర్గంలో జనసేన కాకుండా టిడిపి అభ్యర్థి పోటీలో ఉంటే ఇక్కడి వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను ఓడించడానికి వీలుంటుందని నివేదిక అందినట్లు తెలిసింది. గణేష్ కుమార్‌కు దీటైన అభ్యర్థి ఎవరు అనేదానిపై కూడా ఒక సర్వే నిర్వహించగా సీతంరాజు సుధాకర్ దీటైన అభ్యర్థి కాగలరని తెలిసింది. ఈ నేపథ్యంలో సుధాకర్‌కు వర్తమానం అందడంతో ఆయన తన ముఖ్య అనుచరులైన ఇద్దరు కార్పొరేటర్లతో కలిసి చంద్రబాబును స్వయంగా కలిశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన బదులు కూటమి నుంచి టిడిపి అభ్యర్థి పోటీలో ఉండే వీలుందని పరిశీలకులు భావిస్తున్నారు. కూటమి తరపున టిడిపి అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ పోటీలో ఉంటారని కొందరు చెబుతున్నారు.

దక్షిణ జనసేనలో ఏం జరుగుతోంది ?

వంశీకృష్ణ పేరు ప్రకటించకపోవడంతో అనుమానాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో రాజకీయాలు ఆసక్తిగా మారాయి. ఈ నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా కూటమిలోని జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళగిరిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లడం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దక్షిణ నియోజకవర్గంలో పని చేయాలని చెప్పడం చకచకా జరిగిపోయాయి. దీంతో దక్షిణలో జనసేన అభ్యర్థిని తానే అంటూ వంశీకృష్ణ నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ప్రచారానికి ఉపయోగపడే పోస్టర్లను, ఫ్లకార్డులను, బ్యాడ్జీలను తయారు చేయించి వాటిని ప్రచారంలో వినియోగించడం ప్రారంభించారు. అయితే వంశీకృష్ణ శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని నియోజవర్గంలోని జనసేన 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, ఇదే నియోజకవర్గానికి చెందిన మత్స్యకార నాయకుడు మూగి శ్రీనివాసరావు తీవ్రంగా వ్యతిరేకించారు. వంశీకృష్ణ నియోజవర్గానికి సంబంధం లేని వ్యక్తి అని, పొరుగు నియోజవర్గంలో వేరే పార్టీల తరపున రెండు పర్యాయాలు పోటీ చేసి చిత్తుగా ఓటమి చెందారని, అటువంటి వ్యక్తిని దక్షిణలో పోటీకి అవకాశం కల్పిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయించడాన్ని బహిరంగంగా వ్యతిరేకించారు. మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సాధిక్ అనుచరులు వంశీకృష్ణ శ్రీనివాస్ పోస్టర్లను దగ్ధం చేశారు. రెండో రోజు కూడా మరో ప్రాంతంలో పోస్టర్లను దగ్ధం చేసేందుకు వారు ప్రయత్నించగా నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ కార్పొరేటర్ భర్త భీశెట్టి గోపీకృష్ణ, పి.శివ ప్రసాద్‌రెడ్డి తదితరులు అడ్డుకున్నారు. దీంతో ఇరు గ్రూపుల వారూ ఒకరిపై ఒకరు బాహాబాహీకి తలపడ్డారు. విషయం తెలిసి పోలీసులు జోక్యం చేసుకొని గొడవను నిరోధించారు. సాధిక్ అనుచరులైన ఆరుగురిని అరెస్టు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు, ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ప్రదర్శనలు, నిరసనలు చేయరాదని చెప్పి అరెస్టు చేయడంతో వారికి బెయిల్ కూడా మంజూరు కాక సెంట్రల్ జైలు రిమాండ్‌కు తరలించారు. దీంతో సాధిక్ గ్రూపు బహిరంగ నిరసనలకు స్వస్తి చెప్పారు. ఈ పూర్వ రంగంలోనే వంశీకృష్ణ శ్రీనివాస్ పేరును అధికారికంగా ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించలేదని తెలిసింది.



వంశీకృష్ణ పోస్టర్లను దగ్ధం చేస్తున్న జనసేన కార్యకర్తలు (ఫైల్‌ఫొటో)

రాష్ట్రంలో జనసేన పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ స్థానాలకుగాను 18 స్థానాల నుంచి ఆ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను పవన్ కల్యాణ్ ప్రకటించారు. వాటిలో వంశీకృష్ణ పేరు లేదు. మరో ముగ్గురు పేర్లను మాత్రమే జనసేన ప్రకటించవలసి ఉంది. దీంతో వంశీకృష్ణ దక్షిణ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీలో ఉంటారా...? ఉండరా ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖ పశ్చిమం నుంచి సిపిఐ పోటీ



మాట్లాడుతున్న జెవి.సత్యనారాయణ మూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 2024 ఎన్నికల్లో విశాఖ పశ్చిమ నియోజక వర్గం నుంచి సిపిఐ పోటీ చేయాలని నిర్ణయించటం జరిగిందని, ఈ మేరకు అభ్యర్థుల పేర్లను రాష్ట్ర నాయకత్వానికి నివేదించామని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్య నారాయణమూర్తి తెలిపారు. అలాగే విశాఖ పార్లమెంట్ స్థానానికి కూడా పోటీచేసే ఆలోచన ఉంద న్నారు. పార్టీ విశాఖ జిల్లా సమితి, కార్యవర్గ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో సత్య నారాయణ మూర్తి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసారి జరగబోయే ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకమైనవని పేర్కొన్నారు. బిజెపిని, దానికి అంటకాగిన బాబు, జగన్, పవన్‌లను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. దేశం, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ సమీకరణాలను వెల్లడించారు. దేశంలో ఎన్‌డిఎకు ప్రత్యామ్నాయంగా ఏర్పడ్డ ఇండియా వేదిక బలపడుతోందని, దీన్ని చూసి ఓర్వలేని బిజెపి ప్రధాన ప్రతిపక్ష పార్టీల నేతలపై దాడులు చేస్తూ అరెస్టులకు పూనుకొంటోందని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, ఎ.విమల, ఆర్.శ్రీనివాసరావు, అచ్యుతరావు, జి.రాంబాబు, ఎం.మన్మధరావు, ఎస్‌కె.రెహమాన్, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంతరించిపోతున్న అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు మహా విశాఖ నగర పరిధిలోగల బీచ్‌లలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం తెలిపారు. తీర ప్రాంతాల్లో ఎకో వైజాగ్ నేపథ్యంలో ఎకో బ్లూ కార్యక్రమాలలో భాగంగా నిత్యం అన్ని బీచ్‌లలో మెకానికల్ బీచ్ క్లీనింగ్ యంత్రాలతో పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు సముద్ర తీర ప్రాంతాల్లోకి ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలల్లో వలస వచ్చి గుడ్లు పెట్టి వాటి సంతానాన్ని వృద్ధి చేసుకొని మరలా మే నెలలో వాటి పిల్లలతో సముద్రంలోకి చేరుకునే ప్రక్రియ ఉంటుందన్నారు. అంతరించిపోతున్న ఈ తాబేళ్ల సంరక్షణకు జివిఎంసి చేపడుతున్న చర్యల్లో భాగంగా రామకృష్ణ బీచ్, సాగర్‌నగర్, చేపలుప్పాడ, పెదనాగమయ్యపాలెం బీచ్‌లలో మెకానికల్ బీచ్ క్లీనింగ్‌నకు బదులు మే నెల చివరి వరకు మాన్యువల్ పద్ధతిలో శుభ్రతా చర్యలు చేపడతామన్నారు. ఈ నేపథ్యంలో బీచ్‌లో సందర్శించే విహారయాత్రికులు

సమన్వయంతో విజయం సాధిద్దాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమిష్టిగా పోరాడి విజయం సాధిద్దామని టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన జనసేన నాయకులు వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పని చేసి ఘన విజయం సాధించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి నుంచి సీటు ఆశిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జగన్ మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెబుతామన్నారు.

కాంప్లెక్స్ కోసం లెక్కకు మిక్కిలి శిలాఫలకాలు

ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ నినాదంగా మారిన బస్ స్టేషన్

2న ఆర్భాటంగా ముత్తంశెట్టి శంకుస్థాపన

నాలుగున్నరేళ్లు ఎందుకు స్పందించ లేదంటున్న స్థానికులు

ప్రజాశక్తి -తగరపువలస : ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో ఆర్‌టిసి బస్‌స్టేషన్ ఏర్పాటు పాలకుల పుణ్యమా అని ఎండమావిగా మారిందనే చెప్పాలి. వర్తక కేంద్రమే కాదు, అనేక విద్యా సంస్థలకు, ఆసుపత్రులకు కేంద్రంగా ఉన్న తగరపువలసలో ఆర్‌టిసి బస్‌స్టేషన్ లేకపోవడం గమనార్హం. 2004లో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కర్రి సీతారాం స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా ఖాళీ ప్రదేశంలో ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ కు శంకుస్థాపన చేశారు. 2016 జూన్ 19వ తేదీన శివాలయం ఎదురుగా గోస్తనీకి ఆనుకుని 4.09 ఎకరాల విస్తీర్ణంలో బస్ కాంప్లెక్స్ కోసం అప్పటి విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మరోసారి శంకుస్థాపన చేశారు. 1983 నుంచి 1999 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో పెట్రోల్ బంక్ ఎదురుగా పలుసార్లు శంకుస్థాపనలు చేశారు.

పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ప్రజల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అందుకు అనుగుణంగా సదుపాయాలు లేవు. దాదాపు 6 వేల మంది కార్మికులకు ప్రత్యక్షంగా, మరి కొన్ని వేల కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి కల్పించిన చిట్టివలస జ్యూట్ మిల్లు శాశ్వతంగా మూతపడింది. దీంతో మిల్లులో పనిచేసిన కార్మికులు విశాఖ నగరంలో పలు ప్రైవేట్ సంస్థల్లో సెక్యూరిటీ గార్డులుగా, ఇతరత్రా ఉద్యోగాల్లో ఉన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు కూడా విశాఖ నగరంలో ఉన్న ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్నారు. వీరంతా ఆర్‌టిసి బస్సుల్లో ఇక్కడ నుంచి విశాఖ వెళ్లివస్తుంటారు. ఇక్కడున్న పలు ఇంజిరింగ్ కళాశాలల్లో చదివేందుకు విశాఖ నుంచి తగరపువలస వస్తున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న తగరపువలస కేంద్రంగా ఆర్‌టిసి బస్‌స్టేషన్ ఏర్పాటు ఎంతైనా అవసరం.

మద్దిలపాలెం ఆర్‌టిసి డిపో నుంచి తగరపువలస వచ్చే 222 బస్సు సర్వీసులు దాదాపు 35, పెందుర్తి వెళ్లే 55 టి బస్సులు 4, అనకాపల్లి వెళ్లేందుకు అనకాపల్లి, మద్దిలపాలెం డిపోలకు చెందిన 888 బస్సులు 6, స్టీల్‌సిటీ డిపో కూర్మన్నపాలెం నుంచి 111 వి బస్సులు 3 నిత్యం తగరపువలస వస్తూ వెళ్తుంటాయి. సింహాచలం డిపో నుంచి ఇక్కడకు వచ్చే 55 ఎస్ 2 బస్సులు సర్వీస్ లేదన్న కారణంగా సుమారు రెండు నెలలుగా నిలిపివేశారు. సింహాచలం వెళ్లే బస్సులు తగరపువలస నుంచి గాకుండా ఆనందపురం మీదుగా వెళ్తున్నాయి.

మండే ఎండలోనే ప్రయాణీకులు..

ఇక్కడి నుంచి ఇటు విశాఖ, అటు విజయనగరం వెళ్లాలన్నా ప్రయాణికులు ఎండలో ఉండాల్సిందే. వర్షం కురిసినా, ఎండ తీవ్రమైనా జంక్షన్ వద్ద ఉన్న దుకాణాల షెల్టర్ల వద్ద ఉండాల్సిన పరిస్థితి. ఇంతటి దుస్థితికి కారణం సుదీర్ఘ కాలంగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధులేనని చెప్పవచ్చు. టిడిపి, కాంగ్రెస్, వైసిపిల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రులుగా పదవులు వెలగబెట్టిన వారూ ఉన్నారు. వీరంతా ఆర్‌టిసి బస్‌స్టేషన్ నిర్మిస్తామని ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ వాగ్దానాలు చేసిన వారే. ప్రజలను నమ్మించేందుకు శిలాఫలకాలు కూడా వేసేవారు. వాగ్దానాలు ఇచ్చి తప్పడం ఆనవాయితీగా మారింది. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కూడా మినహాయింపేమీ కాదు. ప్రస్తుతం ఇతను భీమిలి వైసిపి అభ్యర్థిగా కూడా ఉన్నారు. బస్ స్టేషన్ హామీ నాలుగున్నరేళ్లు గుర్తుకు రాలేదు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మార్చి 2వ తేదీన స్థానిక శివాలయం ఎదురుగా బస్ స్టేషన్ కోసం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ నిధులు కాదు సుమా భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ సహకారంతో రూ.2 కోట్లతో బస్ స్టేషన్ నిర్మించనున్నారు.



బస్‌స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన ముత్తంశెట్టి (ఫైల్)

బాధితునికి పరామర్శ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామానికి చెందిన బి.చంటికి చెందిన పశువుల పాక ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధంకావడంతో సంఘటనా స్థలాన్ని వైసిపి నాయకులు పొట్నూరు చంద్రశేఖర్ సోమవారం పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగినదీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితునికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంపై పలు అనుమానాలు ఉన్నట్లు బాధితుడు వాపోయాడు.


కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక సన్ స్కూల్‌లో 104 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇదే అసోసియేషన్ ఆధ్వర్యాన గత నెల 10వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించిన విషయం విదితమే. ఈ శిబిరంలో నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో కళ్లద్దాలు అవసరమని గుర్తించిన వారికి అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎన్ఎల్ రావు చేతుల మీదుగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్నీ, వెంపాడ శ్రీనివాసరెడ్డి, వి.సతీష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఎన్ఎల్.రావు

జూ పార్కులో జిరాఫీ మృతి



జిరాఫీ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో బెకన్ అనే పేరుగల మగ జిరాఫీ (12.5) ఆదివారం అర్ధరాత్రి మృతిచెందినట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా ఒక ప్రకటనలో తెలిపారు. సందర్శకులను ఎక్కువగా ఆకర్షించే జిరాఫీల్లో ఇప్పటికే ఒకటి మృతిచెందగా, ఆ విషాధం మరువక ముందే బెకన్ కూడా మృతిచెందింది. బెకన్‌ను 2013లో మలేషియాలోని నెగెరా జూ నుంచి విశాఖ జూ పార్కుకు తీసుకొచ్చారు. మృతి చెందిన బెకన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని జూ క్యూరేటర్ తెలిపారు. కార్డియో పల్మనరీ ఫెయిల్యూర్ కారణంగా మృతి చెందినట్టు పోస్టుమార్టం నివేదికలో వైద్యులు నిర్ధారించినట్టు పేర్కొన్నారు. విశాఖ జూ పార్కుకు జిరాఫీలు ప్రత్యేక ఆకర్షణగా ఉండేవని, వాటి మరణం జూ పార్కుకు తీరని లోటని ఆవేదన చెందారు. ఈ లోటును తీర్చేందుకు కోల్‌కతాలోని ఆలీపూర్ జూ నుంచి విశాఖ జూకు త్వరలో రెండు జిరాఫీలను తీసుకొస్తామని, దీనికోసం సిజెడ్ఎకు ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలిపారు.

మరణ మృదంగం

జూ అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో మూగ జీవాల వరుస మృతితో మరణ మృదంగం మోగినట్లుంది. అరుదైన జాతులు, సందర్శకులను, చిన్నారులను ఎక్కువగా ఆకర్షించే మూగ జీవాలు వరుసగా మృత్యువాత పడుతున్నాయి. దీంతో జంతు ప్రేమికులు నిరాశకు గురవుతున్నారు. జంతువుల వరుస మరణాలకు జూ అధికారులు నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నో వ్యయ, ప్రయాశలతో ఖండాంతరాలను దాటి తీసుకొచ్చిన జిరాఫీలు, చింపాంజీలు, పెద్ద పులులు, సింహాలు జూ పార్కులో మృతి చెందాయి. ఇప్పటికే ఓ జీబ్రా, రెండు జిరాఫీలు, పెద్ద పులులు, సింహాలు, చింపాంజీలు మృతి చెందాయి. 2019లో అప్పటి జూ క్యూరేటర్ యశోదాబాయ్ కలకత్తా అలేవురి జూ నుంచి ఒక జత జీబ్రాలను తీసుకొచ్చారు. వాటిని ఒక ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌లో ప్రవేశపెట్టారు. అప్పట్లో అవి ఎంతగానో సందర్శకులను ఆకర్షించేవి. అవి కూడా ఒక దాని తరువాత ఒకటి మృతి చెందాయి. హుదూద్ తుపాన్ ముందు 2013 అప్పటి జూ క్యూరేటర్ రామలింగం చొరవతో మలేషియా నుంచి జత జిరాఫీలను విశాఖ జూ పార్కుకు తీసుకొచ్చారు. జీబ్రా మృతి చెందిన రెండు నెలల కాల వ్యవధిలోనే 2023 మే 17న ఆడ జిరాఫీ మృతి చెందింది. ఇలా జూ పార్కులో జంతువుల వరుస మృతి ఆందోళనకు గురిచేస్తోంది.

వైద్యుల లేమే కారణమా?

ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో జంతువుల వరుస మరణాలకు అనుభవజ్ఞులైన పశువైద్యులు అందుబాటులో లేకపోవడమేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. పదేళ్లుగా జూలో పనిచేస్తున్న వైద్యుడు దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. పూర్తి స్థాయి, అనుభవజ్ఞులైన వైద్యులను అందుబాటులోకి తీసుకొస్తే మంచిదని జంతు ప్రేమికులు అంటున్నారు.

నేరాలు ఘోరాలు

సరుగుడు తోట దగ్ధం

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో సరుగుడు తోట కాలి బూడిదైంది. స్థానికుల కథనం మేరకు...రావికమతం మండలంలోని గోంప గ్రామానికి చెందిన కొప్పాక నారాయణమ్మకు చెందిన సుమారు 40 సెంట్లు భూమిలో ఉన్న సరుగుడు తోట సోమవారం ఖాళీ బూడిదైంది. సుమారు 60 వేల ఆస్తి నష్టం జరిగినట్లు పలువురు అంచనా వేస్తున్నారు.



పట్టుబడ్డ మద్యం

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-చోడవరం : అక్రమంగా తరలిస్తున్న 55 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక సీఐ బి శ్రీనివాసరావు తెలిపారు. దావునాపల్లి గ్రామంలో చవితిన గోవిందు 39 మద్యం బాటిళ్లు, గజపతినగరం వద్ద జుత్తాడ గ్రామానికి చెందిన శివాల ఆదినారాయణ 15 బాటిళు తరలిస్తుండగా పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

13 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా ఓ వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేశామని గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామానికి చెందిన రాజేష్ సోమవారం 13 మద్యం బాటిళ్లు పట్టుకు వెళుతుండగా కొంకసింగి జంక్షన్ వద్ద పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొంకసింగిలో గడ్డిమేటు దగ్ధం

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: గొలుగొండ ముండలం లోని కొంకసింగి గ్రామంలో పాడి రైతుకు చెందిన గడ్డి మేటు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మడుగు సూరిబాబు పశువులకు ఏర్పాటు చేసుకున్న గడ్డి మేటు సోమవారం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. విద్యుత్ వైర్ల నుంచి అగ్గి రాజుకొని ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు వాపోతున్నారు. ఈ ప్రమాదంలో తనకు 30వేల నష్టం జరిగిందని తెలిపాడు.

సాంకేతిక విద్యా పరిషత్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ సమీపంలోని సాంకేతిక విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్‌కు సంబంధించి కంప్యూటర్ అప్లికేషన్స్ ఎలా ఉపయోగిస్తున్నారనే అంశంపై రిసోర్స్ పర్సన్ కె.రామ్‌మోహన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ ఎస్‌విహెచ్ రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాహుల్ అల్వార్ దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు భట్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జె.ఆనంద్ చందూలాల్, అడ్మిషన్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్‌సి.అనిల్, సివిల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.మాధురి, సివిల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న సాంకేతిక విద్యా పరిషత్ సిబ్బంది


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు నరసింహమూర్తి

వైసిపికి రాజీనామా : గుంటూరు

ప్రజాశక్తి-పెందుర్తి : నియోజకవర్గ అభ్యర్థిని కాపులకు ఇవ్వాలని చెప్పినా అధిష్టానం స్పందించకపోవడంతో ఇప్పటికే వైసిపికి రాజీనామా లేఖ పంపానని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు నరసింహమూర్తి తెలిపారు. తన స్వగ్రామం సరిపల్లిలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్, ప్రజారాజ్యం పార్టీలలో పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. ఇక్కడి సమస్యలను అనేకమార్లు అదీప్‌రాజు దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. పెందుర్తి నియోజకవర్గం అత్యధికంగా కాపులకు ఉన్న ప్రాంతమని, వైసిపి టికెట్ కాపులకే కేటాయించాలని కోరినా అధిష్టానం వినిపించుకోలేదని తెలిపారు. ఏ పార్టీలో చేరాలనేది త్వరలోనే చెబుతానని ఆయన పేర్కొన్నారు.

నూకాంబిక అమ్మవారి వార్షిక మహోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : శుద్ధ పౌర్ణమి సందర్భంగా జైభారత్‌నగర్, బర్మాక్యాంపులోని నూకాంబిక అమ్మవారి వార్షిక మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, జైభారత్‌నగర్ గ్రామ అధ్యక్షులు బొగ్గు శ్రీను, వసంతల అప్పారావు, కర్రి రామారెడ్డి, అంబటి శైలేష్, కళ్యాణ శ్రీను, రాజాన గంగరాజు, హేమంత్, పద్మ, అప్పారావు, సబ్బవరపు శ్రీను, చిన్న, గణేష్, ముక్క రమణ, శంకర్, కంటిపిల్లి శ్రీను, ఈశ్వరరావు, రామారెడ్డి, శ్రీరామ్, జాగరపు అప్పారావు, రవి, శ్రీను పాల్గొన్నారు.


ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు వీరే...

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి -భీమునీపట్నం : దక్షిణ భారత హిందీ ప్రచార సభ (చెన్నై) ఆధ్వర్యాన ఫిబ్రవరిలో జరిగిన హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు సోమవారం అభినందించారు. హిందీ పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలు రాసిన 77 మంది కూడా ఉత్తీర్ణత సాధించినట్లు కృష్ణారావు తెలిపారు. హయ్యర్ గ్రేడ్ హిందీ పరీక్షలు రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్థ పరీక్షల్లో 12 మందికి గాను 11 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. వీరందరినీ భీమిలిలో అభినందించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని గత్తుం పంచాయతీ రహదారి నిర్మాణం చేపట్టాలని వైస్ ఎంపిటిసి కొండలరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు డిమాండ్ చేశారు. మండలంలోని గత్తుం పంచాయతీలో పర్యటించి రహదారిని పరిశీలించారు. గతుం పంచాయతీ నుంచి దుర్గం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. పంచాయతీ నుంచి జంగంపుట్టు, వెలగపాడు వరకు నిర్మాణం చేస్తున్న రోడ్లు పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండా వదిలేయడం సరికాదన్నారు.వాటిని కూడా పూర్తిస్థాయి చేయాలన్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని పలుమార్లు సిపిఎం, గిరిజన సంఘ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాల ఫలితంగా రహదారి మంజూరైందన్నారు. రహదారి పూర్తిస్థాయిలో చేపట్టాలని కోరారు.రహదారి సౌకర్యం కల్పించకుండా ఎన్నికలకు ఓట్లు అడిగే హక్కు వైసిపి ప్రభుత్వానికి లేదన్నారు. జంగంపుట్టు దుర్గం గ్రామానికి తాగునీరు సౌకర్యం లేక స్వచ్ఛంద సేవ ట్రస్టుల ద్వారా నీళ్ల తెచ్చుకుని తాగుతున్నారన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టాలని కోరారు.

గుడివాడకు తిప్పల సహకారం అందేనా?

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్‌కు తిప్పల నాగిరెడ్డి గ్రూపు నుంచి సహకారం అందుతుందా అనే అనుమానాలు నియోజకవర్గంలో వ్యక్తమవుతున్నాయి. గాజువాక సమన్వయకర్తగా ఉరుకూటి చందును నియమించిన తర్వాత తిప్పల నాగిరెడ్డి బహిరంగంగానే వ్యతిరేకించారు. వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ఎదుట కూడా వ్యతిరేకించారు. అక్కడితో ఆగకుండా తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య కలిసి బొత్స సత్యనారాయణతో అనేకసార్లు మంతనాలు జరిపారు. చందు అయితే ఓడిపోతాడని, తమలో ఎవరికోఒకరికి ఇవ్వాలని అడిగినట్లు సమాచారం. వీరందరినీ కాదని చివరి నిమిషంలో గుడివాడ అమర్‌నాథ్‌కు టికెట్ కేటాయించారు.

ఈ క్రమంలో ప్రస్తుతం తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ





ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మధ్య అనేకసార్లు రహస్య భేటీలు జరిగినట్లు గాజువాకలో ప్రచారం జరుగుతోంది. గాజువాకలో అయితే పల్లా ఫ్యామిలీ, లేకపోతే తిప్పల ఫ్యామిలీ ఎమ్మెల్యేగా ఉండాలని, మూడో వ్యక్తికి అవకాశం ఇవ్వరాదని మంతనాలు జరిగినట్లు తెలుస్తోంది. తనకు, తన కుమారునికి గాజువాక టికెట్ రాదని స్పష్టమయ్యాక అనేక బహిరంగ సభల్లో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఉన్న వేదికలపై 2024లో కాబోయే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అని నాగిరెడ్డి చెప్పడంపై పలువురు చర్చించుకుంటున్నారు. అప్పుడు ఉరుకూటి చందును దృష్టిలో పెట్టుకొని నాగిరెడ్డి అలా మాట్లాడి ఉండవచ్చు అని కొందరు అభిప్రాయపడుతున్నారు. నాగిరెడ్డికి ఉన్న సొంత బంధు వర్గం గుడివాడ అమర్‌నాథ్‌కు ఓటు వేస్తారా అన్న చర్చకూడా నడుస్తోంది.

మంత్రి అమర్‌నాథ్ మర్యాదపూర్వకంగా తిప్పల నాగిరెడ్డితే మొదటి సమావేశం ఏర్పాటు చేశారు. సతీమణికి ఆరోగ్యం బాగోలేదని ఆ సమావేశానికి నాగిరెడ్డి హాజరుకాలేదు. తిప్పల దేవన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. తిప్పల నాగిరెడ్డిపై ఉన్న వ్యతిరేకతతో వైసిపి కార్పొరేటర్లు ఎవరూ ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఈ విధంగా ప్రస్తుతం గాజువాకలో వైసిపిలో గ్రూపులు నడుస్తున్నాయి.

'ఉత్తరం'లో వైసిపి ప్రచారం


అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ప్రచారం నిర్వహించారు. మార్నింగ్ వాక్ చేస్తున్న వారిని కలిసి ఎన్నికల్లో మద్దతివ్వాలని కోరారు. తనను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని వాకర్స్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొడ్డేటి కాశీ విశ్వనాథ్, ఆనంద్ సింగ్, దేవుడుబాబు మాస్టర్, బులుసు జగదీష్, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జివిఎంసి 43వ వార్డు అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ ఆధ్వర్యాన పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెకె.రాజు హాజరై మాట్లాడారు.

43వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యాన వార్డు ఎన్నికల కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సమిష్టి కృషితో ముందుకు సాగాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, నాయకులు ఆళ్ల శివగణేష్, బులుసు జగదీష్, రవీందర్‌నాథ్‌ఠాగూర్, తిరుపతిరావు, పారుపల్లి రవి, బైర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మేధో హక్కులపై అధ్యయనాలకు జి-సెప్‌తో గీతం ఎంఒయు

ప్రజాశక్తి-మధురవాడ : మేధోహక్కులు (ఐపి)లపై బోధన, పరిశోధన, సదస్సులు, వర్క్‌షాప్‌లను నిర్వహించడానికి గోవాలోని గోవా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ (జి-సెప్)తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, జి-సెప్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమేష్ బనకర్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రెండు సంస్థల మధ్య కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా గీతం స్కూల్ ఆఫ్ లా తో పాటు వివిధ విభాగాలలో అధ్యాపకులకు, విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులను నిర్వహించడంతో పాటు మేధో హక్కులపై క్షేత్ర స్థాయిలో పరిశీలన, అధ్యయనాలకు అవకాశం కల్పించనున్నారు. గీతం అధ్యాపకులకు మేధోహక్కులపై ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను అవగాహన కలిగించే కార్యక్రమాలను జి-సెప్ నిపుణులు నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా జి-సెప్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమేష్ బనకర్ మాట్లాడుతూ, యువతకు మార్గదర్శకం వహించడంతో పాటు మేధోహక్కులపై దేశంలో ప్రథమంగా గోవా కాలేజ్ ఆఫ్ ఫార్మశీలో తమ కేంద్రం ఏర్పాటు అయిందని, దేశంలో 16 రాష్ట్రాలలోను ఒక కేంద్రపాలిత ప్రాంతంలోను పరిశ్రమలు, విద్యాలయాలకు పలు కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. మేధో హక్కులపై 275 పరిశోధన కార్యక్రమాలు, 100కు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. గీతంతో సంయుక్త కార్యక్రమాలకు ఆసక్తితో ఉన్నామన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ, బోధనతో పాటు పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని తద్వారా శాస్త్ర విజ్ఞానంలో దేశం గర్వించ తగ్గ అత్యున్నత పరిశోధనలను నిర్వహించాలనేది తమ లక్ష్యం అని వెల్లడించారు. ఈ క్రమంలో మేధో హక్కులపై అవగాహన తమ విశ్వవిద్యాలయం పరిశోధకులకు ఉపయోగపడగలదన్నారు. కార్యక్రమంలో గీతం జి-టెక్ డిప్యూటీ డైరెక్టర్ సోంభట్ శాస్త్రి, గీతం స్కూల్ ఆఫ్ లా సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న గీతం, జి-సెప్ ప్రతినిధులు

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్పొరేటర్ బల్ల శ్రీనుకు పరామర్శ

ప్రజాశక్తి-వేపగుంట : గుండె పోటుతో విశాఖ నగరంలోని విజయశ్రీ హాస్పిటల్‌లో చికిత్స కోసం చేరిన 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనును పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు సోమవారం పరామర్శించారు. వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడి కార్పొరేటర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో గండి రవికుమార్, బైలపూడి భగవాన్ జయరామ్, దేవి సాంబ, తదితరులు ఉన్నారు.


ముత్తంశెట్టిని గజమాలతో స్వాగతిస్తున్న ప్రజలు

గిడిజాలలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల, ముచ్చర్ల గ్రామాల్లో భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం ప్రచారం నిర్వహించారు. గిడిజాల పంచాయతీ పరిధిలో వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను ఆధ్వర్యాన ముత్తంశెట్టికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రచారాన్ని సాగించారు. గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం పేదలకు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి గురించి వివరిస్తూ ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బంక సత్యం, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, ఇల్లాపు వెంకట జగన్, సర్పంచులు షినగం అప్పలరాజు, ఎర్రయ్య, కోరాడ ముసలి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట ఫార్మా వ్యర్థ కెమికల్స్

- తగలబెట్టిన కంపెనీల యాజమాన్యాలు
- పరవాడ ప్రాంతంలో దట్టంగా కమ్మేసిన పొగ
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి -పరవాడ

ఫార్మా సిటీల్లోని కంపెనీల్లో వ్యర్థ కెమికల్స్‌ను ఆయా కంపెనీల యాజమాన్యాలు డ్రమ్స్‌తో పరవాడ పరిసర ప్రాంతంలోని ఆరుబయట పడేసి, వాటికి మంట పెడుతున్నారు. ఈ విధంగానే సోమవారం పరవాడ తహాశీల్దారు కార్యాలయ సమీపంలోని కొండ ప్రాంతంలో ఉన్న పరవాడ గ్రామానికి చెందిన చెత్త నుండి సంపద కేంద్రం వద్ద ఫార్మా వ్యర్థ రసాయనిక కెమికల్స్‌ను కంపెనీల యాజమాన్యాలు దొంగచాటుగా వాహనాల ద్వారా తీసుకొచ్చి డ్రమ్ములతో పడేశారు. ఎవరూ చూడని సందర్భంలో వాటికి అగ్గిపెట్టి వెళ్లిపోయారు. దీంతో ఈ ప్రాంతమంతా దట్టమైన నల్లని పొగ కమ్మేసింది. స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

రాంకీ ఫార్మాసిటీ డంపింగ్ యార్డ్ పూర్తిగా నిండిపోవడంతో ఫార్మా కంపెనీల్లోని వ్యర్థ పదార్థాలను ఎవరికి వారే వేరే చోటికి తరలించాలని ఆయా కంపెనీలకు రాంకీ యాజమాన్యం మౌఖిక ఆదేశాలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా కంపెనీల యాజమాన్యలు రాత్రుల వేళలో వ్యర్థాలు పరవాడ పరిసర ప్రాంతాలలో ఎక్కడపడితే అక్కడ విడిచివెళ్తున్నట్లు తెలుస్తోంది.



ఫార్మా వ్యర్థ కెమికల్స్‌కు నిప్పుపెట్టడంతో కమ్మేసిన పొగ

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ఫార్మా వ్యర్థ రసాయనాలను ఎక్కడపడితే అక్కడ విడిచిపెట్టి తగలబెడుతున్న రాంకీ ఫార్మాసిటీ యాజమాన్యంపైనా, ఫార్మా కంపెనీల యాజమాన్యాలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ కాలుష్యంతో ప్రజల అల్లాడిపోతున్నారన్నారు. ఇప్పటికే ఫార్మా పరిశ్రమల్లో రసాయనిక వ్యర్థ కెమికల్స్‌ను పంట పొలాల్లో ఎవరూ చూడని సందర్భాల్లో విడిచి పెడుతున్నారని విమర్శించారు. గతంలో మునగపాక మండలం ఉమ్మలాడలో ఒక ఫార్మా కంపెనీ వ్యర్థ రసాయనాలను రైతు పంట పొలంలో విడిచిపెట్టిందని గుర్తు చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గనిశెట్టి తెలిపారు.



ఎన్నికైన వారిని అభినందిస్తున్న దృశ్యం

జిల్లా డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం సోమవారం వైఎమ్‌విఏ వివరాల వెంకటరమణ ఏసీ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.కరుణ్ కుమార్ గుప్తా, రాష్ట్ర మాజీ అధ్యక్షులు టి.కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రెసిడెంట్ వంకాయల ఈశ్వరరావు, సెక్రటరీ ఎన్‌ఎస్ ప్రకాష్ గుప్తా, ట్రెజరర్ వై సతీష్ కుమార్, నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా మందులు వర్తకులు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు·



రైల్వే అధికారులకు రాసిన లేఖను చూపుతున్న బాబ్జి తదితరులు

రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. రైల్వే డిఆర్‌ఎమ్, జీఎంకి రాసిన లేఖను సోమవారం అనకాపల్లి జేనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ప్రధాన కేంద్రం నుండి ప్రతిరోజూ ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, చిల్లర వర్తకులు, సాధారణ ప్రయాణికులు సుమారు ఐదు వేల మంది విశాఖపట్నం వెళ్ళి రావడానికి సమయానికి రైళ్ళు లేక తగిన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందులు పరిష్కరించాలని రైల్వే డిఆర్‌ఎమ్, జీఎంలకు లేఖ రాసినట్లు తెలిపారు. గడచిన రెండు నెలలుగా గుంటూరు-రాయగడ, మచిలీపట్నం, ఎక్స్‌ప్రెస్‌లు విశాఖపట్నం కాకినాడ పోర్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారని, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌కు అనకాపల్లిలో హాల్టు లేదని, కాచిగూడ ట్రైన్‌లో ఎవ్వరిని ఎక్కనివ్వరని పేర్కొన్నారు. పేరుకే అనకాపల్లిని జిల్లాగా ప్రకటించినా సరిపోయే మౌలిక సదుపాయాలు లేవని, రైల్వే స్టేషన్ పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే అధికారులు వెంటనే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో కొలసాని రమణ, అన్నం వెంకటరావు, కనుబుడ్డి నరసింగరావు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం బూడిని ఓడించాలి



పైలా ప్రసాదరావుకు స్వాగతం పలుకుతున్న జనసే నాయకులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును ఓడించడానికి జనసేన కార్యకర్తలు కృషి చేయాలని మాడుగుల నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం పైలా ప్రసాదరావును జనసేన కార్యకర్తలకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను సమన్వయం చేస్తూ ప్రచారంలో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అరాచక, అక్రమ దౌర్జన్యాలను ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలని కోరారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాయపురెడ్డి కృష్ణ, మండల అధ్యక్షులు బాలిబోయన సంతోష్, నాయకులు సేనాపతి నాగరాజు, అన్నంరెడ్డి వెంకటలక్ష్మి, మారపురెడ్డి శివ, నంబారు రామదాసు, సూరి, ఉమామహేష్, బొట్ట పాలవెల్లి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు జగన్ బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సిఎం జగన్మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో చేనేత కుటుంబం పాల సుబ్బారావు, భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్యకు ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీష్ డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేత, జిల్లా రెవెన్యూ యంత్రాంగం చేసిన అన్యాయానికి విసుగెత్తి జీవితంపై విరక్తితో సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని, శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు శాంతిభద్రతలు కాపాడలేని ప్రభుత్వ యంత్రాంగంపై గవర్నర్ తగు నివేదిక తెప్పించుకొని రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, దౌర్జన్యాలు, నరమేధం, హింసపై ఎన్నికల సంఘం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ నాయకులు గింజాల లక్ష్మణరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, గుడాల సత్యనారాయణ, బత్తుల లక్ష్మి, తిప్పాన అప్పారావు, పూడి త్రినాథరావు, శీరం వెంకటలక్ష్మి, వేగి వెంకట్రావు, భువనేశ్వరరావు పాల్గొన్నారు.



బహుమతుల ప్రదానం చేస్తున్న వైసిపి నేత శ్రీనివాసరావు

కోలాటం పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - పరవాడ : మండల కేంద్రం పరవాడ గ్రామంలో శ్రీపైడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవాలు సందర్భంగా ఆదివారం జరిగిన కోలాటం పోటీలలో గెలుపొందిన వారికి సోమవారం వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు చేతులమీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి కింద బంగారమ్మపురం కళాకారులకు రూ.15 వేలు, ద్వితీయ బహుమతి శ్రీరామపట్నం వారికి రూ.12 వేలు, తృతీయ బహుమతి మొగలిపురం వారికి రూ.9 వేలు, నాలుగో బహుమతి కింద లక్కవరం వారికి రూ.6 వేలు, అంకుపాలెం వారికి రూ.6 వేలు, ఐదో బహుమతి జుత్తాడ కళాకారులకు రూ.3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ రాళ్లకు కోడ్ వర్తించదా?

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

వైఎస్‌ఆర్ జగనన్న భూ రక్ష పథకం కింద చేపట్టిన భూ సమగ్ర సర్వే అనంతరం భూమి సరిహద్దుల్లో వేయాల్సిన సర్వే రాళ్లు మండలంలోని కొన్నెంపూడి జంక్షన్ వద్ద గుట్టలుగా పడి ఉన్నాయి. ఎన్నికల నిబంధన ప్రకారం రాజకీయ పార్టీల గుర్తులు, రాజకీయ నాయకులు శిలా విగ్రహాలు, ప్రభుత్వ పథకాలు తెలియజేసే పేర్లు బహిరంగంగా ప్రదర్శించ కూడదు. కాని జగన్ పేరుతో గల సర్వే రాళ్లు రోడ్డు పక్కనే వందలాది వున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆడవాళ్లు ఏమాత్రం ఉన్నా ఆగమేఘాల మీద తీయించే అధికారులు అధికార పార్టీకి ఈ నిబంధనలు వర్తించవా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



వైఎస్‌ఆర్ జగనన్న భూరక్ష-2020 పేరుతో ఉన్న సరిహద్దు రాళ్లు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులకు నిధులు విడుదల చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత తీర్చడానికి అవసరమైన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యమని అధికార వైసిపి నిత్యం ప్రకటిస్తుంది తప్ప ఆచరణలో ఆసుపత్రులకు అవసరమైన నిధులు విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. భవన నిర్మాణాలకు ఇచ్చిన ప్రాధాన్యత రోగుల వైద్య సేవలు మెరుగుపడేందుకు, అవసరమైన వైద్య సదుపాయాల కోసం ఇవ్వలేదని విమర్శించారు. జిల్లా ఆసుపత్రి అయిన ఎన్టీఆర్ ఆసుపత్రిలో నిధుల కొరత కారణంగా రోగులకు సరిపడా మందులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. మందులు అందుబాటులో లేకపోవడంతో కమ్యూనిటీ, ప్రాంతీయ ఆసుపత్రుల నుండి మందులు తీసుకొచ్చి ఇస్తున్నారంటేనే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థమౌతుందని పేర్కొన్నారు. పెరుగుతున్న రోగుల అవసరాలకు తగ్గుట్లుగా మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలుగొని కమ్యూనిటీ, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రిల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందుల కొరత తీవ్రంగా వుండడంతో అనివార్య పరిస్థితుల్లో పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళి వేల రూపాయలు అప్పులు చేసి ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు కొనసాగకుండా తక్షణమే ఎన్టీఆర్ ఆసుపత్రితో సహా రోగులు రద్దీగా వుండే అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా సరఫరా చేయాలని, ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.



మహిళలతో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

ధర్మశ్రీ ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి -చోడవరం

చోడవరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ సోమవారం గోవాడ, అంబేరిపురం గ్రామాల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలో ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ప్రతిసారి అంబేరిపురం గ్రామం నుండి ప్రచారం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రెండు గ్రామాల్లోనూ ఇంటింటికి వెళ్లి తమకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవకు సత్యారావు, పిఎసిఎస్ అధ్యక్షుడు బీర సత్య రావు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, సూరిశెట్టి గోవిందు, జ్యోతుల రమేష్, ఉప్పల బాబు, ఓరుగంటి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సీతయ్యమ్మ కుమార్తెలు

తల్లికి తలకొరివి పెట్టిన తనయ

ప్రజాశక్తి- మునగపాక

కన్న తల్లికి తల కొరివి పెట్టి తన రుణం తీర్చుకుంది ఓ తనయ. మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన ఆడారి సీతయ్యమ్మ (80)కు ఆరుగురు కుమార్తెలు. మగ సంతానం లేదు. కుమార్తెలందరికీ వివాహాలయ్యాయి. భర్త చనిపోవడంతో వృద్ధురాలైన సీతయ్యమ్మ అలనా పాలన కుమార్తెలే చూసుకునేవారు. సీతయ్యమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మరణించారు. పుత్రులు లేని వారు పున్నామ నరకానికి పోతారనే సామెతను వమ్ము చేస్తూ, మేము కూడా కొడుకులకు సరిసాటి అని కూతుర్లు ముందుకొచ్చి సీతయ్యమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. చిన్న కుమార్తె జయ పద్మ ఆమెకు తలకొరివి పెట్టింది. తమ తల్లికి తల కొరివి పెట్టి అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించిన సీతయ్యమ్మ కుమార్తెలను పలువురు ప్రశంసించారు.

గ్రామాల్లో భరత్‌కుమార్ ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కొండుపాలెం, చేనుల అగ్రహారం గ్రామాలలో వైసిపి అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రానున్న రోజుల్లో ఇంకా మంచి జరగాలనుకుంటే జగన్మోహన్ రెడ్డిని సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, గొల్లవిల్లి శ్రీనివాసరావు, పలక రవి, పెద్దిశెట్టి గోవింద్, పద్మ, మర్రిపల్లి శోభ, నీలకంఠ సంతోషిలక్ష్మి, బండ అప్పలరాజు, గనిరెడ్డి శ్రీరామ్, ఉపసర్పంచ్ గనిరెడ్డి బుజ్జి, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, సూరిబాబు, ప్రసాద్ వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న వైసిపి అభ్యర్థి భరత్ కుమార్

చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలు తరలింపుపై కేసు నమోదు

వాహనాన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించిన సిపిఎం నేత వెంకన్న


ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని చేపల చెరువుల్లో చేపల పెంపకానికి చికెన్ షాపుల నుంచి చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఎపి 39టిఎఫ్2260 ఆటోను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న ఆదివారం పట్టుకొని దేవరాపల్లి పోలీసులకు అప్పగించారు. చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న తారువ గ్రామానికి చెందిన బలె యేసు తండ్రి నరసయ్యపై వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర ప్రజాశక్తికి తెలిపారు.

మంత్రి అండతోనే చేపల చెరువుల యజమానుల బరితెగింపు

రాష్ట్ర మంత్రి అండతోనే అక్రమంగా చేపల చెరువులు నిర్వహిస్తున్న వారు బరి తెగింపునకు పూనుకుంటున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవరాపల్లి మండలంలోని కొత్తపెంట, కలిగోట్ల, ములకాలాపల్లి, పెదనందిపల్లి, తారువ, మారేపల్లి, చేనులపాలెం, సంజీవపురం తదితర గ్రామాల్లో దాదాపుగా వెయ్యి ఎకారాల్లో అక్రమంగా చేపల పెంపకం చేస్తున్నారని తెలిపారు. ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులు ఇక్కడి రైతులు, ప్రజలకు డబ్బులు ఆశ చూపించి, భూములు లీజుకు తీసుకొని ఎటువంటి అనుమతుల్లేకుండా చేపలు చెరువులు తవ్వకాలు చేశారని పేర్కొన్నారు. పశుమాంసం, చికెన్ వ్యర్థాలు, చని పోయిన గొర్రెలు, మేకలను, బ్రాండిక్స్, ఇతర కంపెనీల్లోని క్యాంటీన్లలో వ్యర్థాలను తీసుకొచ్చి ఈ చెరువుల్లో ఉన్న చేపలకు వేసి పెంపకం చేస్తున్నారని తెలిపారు. ఈ చేపలు తిన్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, చేపల చెరువుల కింద పంట పొలాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో అనేక సార్లు అధికారులకు సిపిఎం ఫిర్యాదు చేసిందని గుర్తు చేశారు. అలాగే ఈ నెల 20న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మత్స్యశాఖ అధికారులు తుతూమంత్రంగా దర్యాప్తు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దీంతో అక్రమ చేపలు పెంపకందార్ల మంత్రి అండ చూసుకొని విచ్చలవిడిగా వ్యర్థాలను వాడుతున్నాని తెలిపారు.





చికెన్ వ్యర్థాలతో పట్టుబడిన ఆటో, ఆటోలోని డ్రమ్‌లో ఉన్న చికెన్ వ్యర్థాలు

విశాఖను గంజాయి రాజధానిగా మార్చారు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖను గంజాయి రాజధానిగా మార్చాలని అనకాపల్లి టిడిపి, జనసేన బిజెపి ఉమ్మడి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. జివిఎంసి అనకాపల్లి జోనల్ పరిధి 82వ వార్డు విజయ రామరాజుపేటలో వార్డు ఇన్చార్జ్ పోలవరపు త్రినాథ్ అధ్యక్షతన టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణులతో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాత మున్సిపల్ 1, 2, 33, 34 వార్డులకు చెందిన మూడు పార్టీల కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం యువత కూటమికి అండగా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే వైసిపి ప్రభుత్వం తొలగించిన పేదల పింఛన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు మల్ల సురేంద్ర, శ్రీరాందాస్ గోవింద, మాధంశెట్టి నీలబాబు పాల్గొన్నారు.



కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ



గడ్డివాము మంటలను ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది, స్థానికులు

పశువులపాక, గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో వనం శ్రీరామ్‌కు చెందిన ఒక పశువులు పాక, రెండు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. శ్రీరామ్‌కు చెందిన పశువుపాక గడ్డివాములకు దగ్గరలో ఉన్న సరుగుడు తోటలో మంటలు పెట్టడంతో ఈ అగ్ని ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. పశువుల పాక, గడ్డివాము మంటల్లో కాలిపోవడాన్ని చూసిన శ్రీరామ్ స్థానిక అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. పాకలో ఉన్న ఆవు దూడ పాక్షికంగా కాలిపోయింది. పాకలో ఉన్న ఆవును తీసుకురావడానికి వెళ్లిన అప్పలకొండ అనే మహిళకు పాక్షికంగా గాయాలు కావడంతో, ఆమెను ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు.

రామాలయం ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని దుప్పుతూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయాన్ని సోమవారం ప్రారంభించి, ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట చేశారు. ఈ నూతన ఆలయంలో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎలమంచిలి నియోజకవర్గ జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్, టిడిపి నేత ప్రగడ నాగేశ్వరరావు, డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ తదితరులు ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశంశెట్టి శంకర్రావు, ఉప సర్పంచ్ దేశంశెట్టి ఈశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

80వ వార్డులో టిడిపి, జనసేన, బిజెపి ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి టిడిపి, జనసేన బిజెపి ఉమ్మడి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణను గెలిపించాలని కోరుతూ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో జీవీఎంసీ 80వ వార్డు స్వామి కోవెలవీధి, మొండిగూడెం భాజాం గారి వీధి, ఎన్టీఆర్ కాలనీ దేవుడు తోటలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు బిఎస్ఎంకె జోగినాయుడు, మళ్ళ శ్రీను, విల్లూరి హరి, మారిశెట్టి భాస్కరరావు, కర్రి మహాలక్ష్మి నాయుడు, సూరిశెట్టి రాముడు పాల్గొన్నారు.

బటన్ నొక్కారు.. నగదు జమ కాలేదు..

వైఎస్ఆర్ చేయూత సొమ్ము కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

పేద, మధ్య తరగతి మహిళల ఆర్థిక స్వావలంబన కోసమంటూ వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేయూత పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. 45 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు చిరు వ్యాపారాలు చేసుకునే నిమిత్తం ప్రభుత్వం చేయూత పథకం కింద ప్రతి ఏడాది రూ.18,750 నగదును మహిళల ఖాతాలో జమ చేస్తుంది. ఈ ఏడాది మహిళల ఖాతాలో నగదు జమ చేసే నిమిత్తం అనకాపల్లి జిల్లా పిసినికాడలో ఈనెల 7వ తేదీన జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేయూత జమ నగదు బటన్ నొక్కారు. ఇది జరిగి సుమారు 15 రోజులు కావస్తున్నా మహిళల ఖాతాల్లో నగదు మాత్రం జమ కాలేదు. ఈ నగదు కోసం మహిళలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చేయూత నగదు కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నగదు జమ అవుతుందా లేదా అంటూ మహిళలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చేయూత నగదును జమ చేయాలని మహిళలు కోరుతున్నారు.

బస్సులు వేసి మరీ తరలించారు

పిసినకాడలో జరిగిన ముఖ్యమంత్రి బహిరంగ సభకు గ్రామాల్లోని చేయూత లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ రావాలని, లేదంటే నగదు జమ కాదని గ్రామస్థాయిలో వాలంటీర్లు లబ్ధిదారులను బెదిరించి మరీ బస్సుల్లో ఎక్కించి తీసుకెళ్లారు. తీరా మహిళలైతే సభకు వెళ్లారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. కాని నగదు మాత్రం జమ కాలేదని మహిళలు అంటున్నారు.



ఉపమాకకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం పౌర్ణమి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. భక్తులు క్యూలైన్ల గుండా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసారు. ట్రాన్స్ కో ఉద్యోగుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, తాగునీరు అందజేశారు. ఆలయం వద్ద మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో అలరించింది .




భారీగా తరలివచ్చిన భక్తులు

వైభవంగా వెంకన్న చక్రస్నానం

వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా 7వ రోజు రాజయ్యపేట సముద్రతీరంలో చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి రోజున విహార యాత్రకు వెళ్లడం అనవాయితీగా వస్తుంది. సాయంత్రం రాజాధిరాజ వాహనంపై స్వామి ఉపమాక గ్రామానికి 5కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజయ్యపేట సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. స్వామి ప్రతిరూపమైన చక్రతీర్థాళ్వార్లు (సుదర్శనమూర్తి) విగ్రహానికి సముద్ర జలాలలో స్నానం చేయించారు. ఈ సమయంలో పలువురు భక్తులు తీరంలో సముద్రస్నానాలు ఆచరించారు. అనంతరం అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసారు.

ఎన్నికల్లో యువకులు జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-మాడుగుల: సార్వత్రిక ఎన్నికల వేళ యువత జాగ్రత్తలు వహించాలని స్థానిక ఎస్సై పి. దామోదర్ నాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, యువత తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. యువత విచ్చలవిడిగా గుంపులు, గుంపులుగా కూడలిలో ఉండరాదన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా యువత సహకరించాలని కోరారు. విచ్చలవిడిగా మద్యపానం సేవించడం నిషేధమని, అనుమతికి మించి మద్యం సీసాలు కలిగి ఉండడం, పరిమితికి మించి అధిక మొత్తంలో డబ్బును కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదన్నారు.



ఎస్ఐ దామోదర్‌నాయుడు

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో సోమవారం పోలీసు సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. పెదబొడ్డేపల్లి, శ్రీకన్యజంక్షన్ మీదుగా అబీద్ సెంటర్ వరకు ఈ కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ కాంతికుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలందరూ ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, ఆర్పీఎస్ఎఫ్ ఎస్ఐ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుగా మండల వ్యాప్తంగా పోలీస్ ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్సై తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం వెంకటాపురం, కొడవటి పూడి, రామచంద్రపాలెం, నీలిగుంట, బికేపల్లి, జల్లురు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రజలు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

నత్తనడకన సచివాలయ నిర్మాణం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో చిన్న బొడ్డేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయం నత్త నడకన సాగుతోంది. సచివాలయం భవనం నిర్మాణం ప్రారంభించి నాలుగు సంవత్సరాల పూర్తయినా నేటికీ మొండిగోడలతో దర్శనమిస్తోంది. నిధులు లేక గుత్తేదారిని నిర్లక్ష్యమో తెలియదు గాని భవన నిర్మాణం ఆలస్యం కావడంతో ఇటు సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బిఎస్‌పి నేతల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం నియోజవకర్గ బిఎస్పీ అభ్యర్థి బొట్టా నాగరాజు సోమవారం గొలుగొండ మండలంలోని పాతకృష్ణదేవిపేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే అన్ని విధాలుగా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. తనకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లి కళ్యాణం, మల్లేశ్వరరావు, నియోజవర్గ అధ్యక్షులు ఎన్. చిరంజీవి కన్వీనర్ గంగాధర్, సీనియర్ నాయకులు చిటికెల అప్పలనాయుడు, యువజన నాయకులు సూరిబాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై కమ్మిన మంచు

మండు వేసవిలో పొగ మంచు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండు వేసవిలో సైతం మండలంలోని పలు గ్రామాల్లో పొగ మంచు సోమవారం దర్శనమిచ్చింది. శీతాకాలాన్ని తలపించే విధంగా మంచు కురియడంతో వేసవి తాపానికి ఊరటనిచ్చింది. ప్రస్తుతం కురుస్తున్న మంచు కారణంగా జీడిమామిడి తోటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గ్యాస్ ఏజెన్సీ మేనేజర్, డ్రైవర్లపై విచారణ

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న గ్యాస్ ఏజెన్సీలో ప్రస్తుతం పని చేస్తున్న మేనేజర్‌ను, గ్యాస్ సిలిండర్లు రవాణా చేసే వ్యాన్ డ్రైవర్లను విధుల నుండి మార్పు చేసి వీరిపై విచారణకు ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్న సిబ్బంది లబ్దిదారుల నుండి ప్రతి సిలెండర్ పై రూ. 1000 నుండి రూ 2000 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని, రిటైర్డ్ డ్రైవరు ఇంకా విధుల్లో కొనసాగిస్తున్నారని వచ్చిన వారాత్త కథనాలపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ స్పందించారు. ఈ మేరకు తక్షణమే గ్యాస్ ఏజెన్సీ మేనేజర్‌ను, గ్యాస్ వ్యాన్ డ్రైవరును అక్కడ విధుల నుండి తప్పించి వేరే సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆరోపణలపై పూర్తిగా విచారణ జరిపి రిపోర్ట్‌ను సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు ఆదేశాలిస్తూ విచారణ అధికారిగా నియమించారు.



జెసిబితో చేపడుతున్న పనులు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - అనంతగిరి:నిలిచిపోయిన రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని గిరిజనులు, సిపిఎం ఆధ్వర్యాన వినూత్న రీతిలో జల దీక్షను ఆదివారం చేపట్టిన విషయం తెలిసిందే. ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం వచ్చిన వార్తా కథనానికి స్పందన లభించింది. అధికారులు తక్షణమే స్పందించి సోమవారం నుండి రోడ్డు పనులను ప్రారంభించారు. పినకోట పంచాయతీ పరిధి కొట్టంగుడ, గొప్పలపాలెం, మీదుగా గుమ్మ పంచాయతీ పరిధి కడరేవు, కరిగోడ గ్రామాలకు రోడ్డు పనులు సంబంధిత అధికారులు పున్నప్రారంభించారు. గత 2021, 22 సంవత్సరంలో గుమ్మ పంచాయతీ మీదుగా కిలోమీటర్ మేర పనులు చేపట్టి నిలిపివేశారు. దీంతో స్దానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు, సిపిఎం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందులు ఆందోళన చేపట్టారు. సంబంధిత అధికారులు రంగంలోకి దిగి పనులను ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు ఆర్. రాజారావు, ఎన్.రామరావు తదితరులు సిపిఎం నేతలకు అభినందనలు తెలిపారు. గిరిజనుల పక్షాల పోరాడేవారికే ఓటు వేస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

నాటు తుపాకులు అప్పగింత

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో నాటు తుపాకులు ఎవరి దగ్గరైనా ఉంటే స్వచ్ఛందంగా అప్పగించాలని ఎస్ఐ పి,మనోజ్ కుమార్ పత్రికా ప్రకటనలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ మేరకు గలగండ పంచాయతీ కుతంగిపుట్టు గ్రామస్తులు పాంగి లవకుశ, కిల్లో గోపాల్, కొర్ర బిస్నాద్‌లు స్వచ్ఛందంగా తమ దగ్గర ఉన్న మూడు నాటు తుపాకీలను పెద్దబయలు పోలీస్ స్టేషన్లో అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గ్రామాలలో ఎవరి దగ్గరైనా నాటు తుపాకులు ఉన్నట్లయితే స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్‌కి వచ్చి అందజేయాలని కోరారు.

ఉత్సాహంగా హోలీ వేడుకలు

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని రాజయ్యపేట సముద్ర తీరంలో సోమవారం ఉదయం పలువురు యువకులు హెూలీ పండుగను ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు. యువకులంతా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ, పూసుకుంటూ సందడి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో యువకులు, పిల్లలు, పెద్దలు హెూలీ పండుగను సంతోషంగా జరుపుకున్నారు. ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా హెూలీ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలో నింజాస్ అకాడమీ విద్యార్థులు సోమవారం ఎన్టీఆర్ స్టేడియంలో హోలి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సుమారు 80 మంది వరకు విద్యార్థులు ఈ వేడుకలు నిర్వహించారు. అకాడెమీ చైర్మన్ వెలగా నారాయణరావు పిల్లలకు రంగులు అందజేశారు. ప్రతి సంవత్సరం కూడా ఈ స్టేడియంలో వేడుకలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ సుతాపల్లి శ్రావణ్, సైకాలజిస్ట్ సుమ, సీనియర్ మె డిలిస్టులు, కోచ్‌లు పాల్గొన్నారు.



నక్కపల్లిలో రంగులతో సందడి చేస్తున్న పిల్లలు

డావిన్సీ స్కూల్లో హోలీ సంబరాలు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలలో సోమ వారం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సుందరయ్య ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ జె.రమణాజీ, ప్రధాన ఆచార్యులు మీనమిశ్రా, డీన్ సూరిబాబు ముందుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది రంగుల లోకంలో చిన్నారులతో చిందులు వేశారు.



డావిన్సీ స్కూల్లో సంబరాలు చేసుకుంటున్న డైరెక్టర్, ఉపాధ్యాయులు

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో యువజన విభాగం ఆధ్వర్యాన హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు పాల్గొని ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు, నాయకులు కిరణ్ రాజు, నీలి రవి, అంబటి శైలేష్, బొట్టా రాజు, తదితరులు పాల్గొన్నారు.



స్నానాలు ఆచరిస్తున్న ప్రజలు

రాజయ్యపేట తీరం జనసంద్రం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట సముద్ర తీరం సోమవారం జనసంద్రంగా మారింది. ఫాల్గుణమాసం పౌర్ణమి సందర్భంగా భక్తులు రాజయ్యపేట సముద్ర తీరంలో సముద్ర స్నానాలు ఆచరించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చారు. భక్తుల రాకతో సముద్రతీరం కిటకిటలాడింది. ఆటోలు, కార్లు, బైక్‌లు, ట్రాక్టర్లపై పలు ప్రాంతాలు నుంచి పెద్ద సంఖ్యలో జనం స్నానాలు ఆచరించేందుకు రాజయ్యపేట సముద్ర తీరానికి తరలివచ్చారు. నక్కపల్లి నుండి ఉపమాక మీదుగా రాజయ్యపేట వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సిఐ విజయ్ కుమార్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

'వైసిపి హయాంలో ముస్లిముల సంక్షేమంపై నిర్లక్ష్యం'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:వైసిపి ప్రభుత్వ పాలనలో ముస్లిం మైనారిటీల సంక్షేమం ఏదీ లేదని జనసేన 39 వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్ ఆరోపించారు. టౌన్ కొత్త రోడ్డు జన సేన కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌కి మైనార్టీలు అంటే ఎంతో అభిమానం వుండేదని, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా చేయలేదన్నారు. రూ.5 ఐదు లక్షల రుణం, 45 ఏళ్లకే పెన్షన్, సబ్ ప్లాన్ నిధులు ఇవ్వలేదన్నారు. మైనార్టీల వివాహానికి లక్ష ఇస్తామన్నారని, వధూవరులు ఇద్దరు టెన్త్ పాస్ అవ్వాలనే షరతు పెట్టారన్నారు. టిడిపి హయాంలో 40,202 మంది కి ఇవ్వగా, వైసిపి హయాంలో 6,346 మందికి మాత్రమే షాది తోఫా ఇచ్చారన్నారు. గతంలో ముస్లింలకు రంజాన్ తోఫా 12 లక్షల 50 వేల మందికి ఇచ్చారన్నారు.రాష్ట్రంలో ముస్లింలకు భద్రత లేదని ఆరోపించారు.



పాడైన రోడ్డును చూపుతున్న నాయకులు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని గత్తుం పంచాయతీ రహదారి నిర్మాణం చేపట్టాలని వైస్ ఎంపీటిసి కొండలరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు డిమాండ్ చేశారు. మండలంలోని గత్తుం పంచాయతీలో పర్యటించి రహదారిని పరిశీలించారు. గతుం పంచాయతీ నుంచి దుర్గం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. పంచాయతీ నుంచి జంగంపుట్టు, వెలగపాడు వరకు నిర్మాణం చేస్తున్న రోడ్లు పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండా వదిలేయడం సరికాదన్నారు.వాటిని కూడా పూర్తిస్థాయి చేయాలన్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని పలుమార్లు సిపిఎం, గిరిజన సంఘ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాల ఫలితంగా రహదారి మంజూరైందన్నారు. రహదారి పూర్తిస్థాయిలో చేపట్టాలని కోరారు.రహదారి సౌకర్యం కల్పించకుండా ఎన్నికలకు ఓట్లు అడిగే హక్కు వైసిపి ప్రభుత్వానికి లేదన్నారు. జంగంపుట్టు దుర్గం గ్రామానికి తాగునీరు సౌకర్యం లేక స్వచ్ఛంద సేవ ట్రస్టుల ద్వారా నీళ్లు తెచ్చుకుని తాగుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టాలని కోరారు.

కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామిక చర్యగా అఖిలపక్ష నేతలు ఆక్షేపించారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ సిపిఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అఖిల పక్ష సమావేశం ఆఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీర రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, ఇండియా కూటమి బలపడుతోందని తెలిసే కేజ్రీవాల్ ను అరెస్టు చేశారని ఆరోపించారు.డ బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఒక్కరిని అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. బిజెపి అవినీతిని ప్రశ్నించే వారిని అరెస్టు చేసి పబ్బం గడుపుకోవడమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు.



సమావేశానికి హాజరైన నాయకులు

కాంగ్రెస్ నేత సోడిదాసు సుధాకర్ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థను కాలరాస్తూ ప్రధాన ప్రతిపక్ష నేతలను బలహీన పరుస్తూ వారిని అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకొందని విమర్శించారు. ఇందులో భాగమే కేజ్రీవాల్ అరెస్టు అని అన్నారు.ఈ కార్యక్రమంలో భారత్ బచావో నేతలు గూడూరు సీతామహాలక్ష్మి, పి. శ్రీనివాస్, ఎస్.వేమన, ఆప్ నాయకురాలు డాక్టర్ సీతల్, ఐఎఫ్ టియు నేత కె.రవి, ఎపిటిఎఫ్ నేత వేణు, మహిళా సమాఖ్య రాష్ట్ర జిల్లా అధ్యక్షురాలు ఎ.విమల, వనజాక్షి, దేవా, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి, తదితరులతో పాటు భారత్ బచావో, ఆప్, వామపక్ష అభిమానులు పాల్గొన్నారు.



హాజరైన గ్రామ పెద్దలు

మే 26 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి -హుకుంపేట:మండల కేంద్రంలో మోద కొండమ్మ జాతర మహెూత్సవాన్ని మే 26, 27,28 తేదీల్లో నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, వర్తక సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. మోదకొండమ్మ ఉత్సవాలకు గౌరవ అధ్యక్షులుగా సర్పంచ్ పూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మ రమ, ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా పాంగి అనిల్, ఉపాధ్యక్షులుగా కొర్ర నాగబాబు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డేటి శివ, నానాజీ, ట్రెజరర్‌గా కడిమి శెట్టి.ప్రసాద్, సహాయ ట్రెజరర్‌గా కోడిదాసు గోవింద్, సహాయ కార్యదర్శులుగా కొర్ర కాసులమ్మ, పాడి వెంకట్, ప్రధాన కమిటీ సభ్యులుగా బద్నాయిని నూకరాజు, మీసాల నాగరాజు ఎన్నికయ్యారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

.ప్రజాశక్తి -అనంతగిరి: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఎం జెడ్పీటీసీ దీసరి. గంగరాజు, టోకురు సర్పంచ్ కిల్లో మొస్యలు కోరారు. టోకురు పంచాయతీ దొరగుడ, బల్యగుడ, కాశిపట్నం పంచాయతీ పల్లంవలస, కాటురు, సార్వనీపాలెం, చిలకగెడ్డ గ్రామాల్లో పర్యటించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, పోడు భూమి పట్టాలు వంటి సమస్యలు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని, రానున్న సార్వత్రిక ఎన్నికలలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజల పక్షాన ఉంటూ నిరంతరం సమస్యలపై పోరాటం చేసే నాయకులను గెలిపిస్తే చట్టసభల్లో గలం వినిపిస్తారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పాటుపడని ఇతర నాయకులు ఎన్నికల వేళలో ఓట్లు కోసం గ్రామాలకు నిలదీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్య కర్తలు జి.దేవన్న, సింగులు, కృష్ణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు



ప్రచారం చేపడుతున్న సిపిఎం నేతలు